# సహ జీవనం

రాత్రి ఎనిమిది గంటలు కావస్తున్నపుడు ఇంటికి వచ్చిన శివకామయ్యకు కోడలు ఇందుమతి గేటుదగ్గర పక్కింటి పరిమళతో మాట్లాడుతూ కనిపించింది.

ఆయన గేటు దాటుతున్నప్పుడు దగ్గరగా వచ్చి "మీకోసం ఆయన ఇప్పటిదాగా చూసి ఎవరో ఫ్రెండ్‌ని కలవాలని వెళ్లారు" అన్నది ఇందుమతి భర్త గురించి చెబుతూ.

"వాడికి నాతో ఏదయినా పని వుందా?" అడిగాడు శివకామయ్య.

"మీతో ఒక విషయం చెప్పాలని"

"ఏమిటి విషయం? నీకు తెలుసునా?"

"అవును.... ఆయన ట్రయినింగ్ ఈరోజుతో పూర్తయిందికదా.... పోస్టింగ్ ఇచ్చారట. ఒంగోలు వేసారని చెప్పారు. నాలుగు రోజుల్లో జాయిన్ కావాలి" ఇందుమతి చెప్పింది.

"సంతోషం. అయితే ఒంగోలులో మీరు ఇల్లు వెతుక్కునే పని కూడా లేదు. నా స్నేహితుడు పాండురంగం ఇల్లు వుంది. ఆ ఇంట్లో రెండు గదులు మీకు అద్దెకు ఇస్తాడు" అన్నాడు శివకామయ్య.

ఆయన ఇంట్లోకి వచ్చిన తర్వాత భార్య సక్కుభాయి కాఫీ ఇచ్చి "వాడిని ఒంగోలు వేసారట" చెప్పింది.

"ఇప్పుడే కోడలు చెప్పింది"

"వెళ్లిపోవాలిట"

"తప్పదు సక్కూ.... దూరం కదా.... అక్కడే వుండాలి"

శివకామయ్య రెండో కొడుకు సూర్యమోహన్‌కి కొన్నాళ్ల క్రితం సహకారశాఖలో ఉద్యోగం వచ్చింది. ఆరునెలల ట్రయినింగ్ పూర్తయ్యాక ఇప్పుడు ఒంగోలు ఆఫీసులో పోస్టింగ్ ఇచ్చారు.

సక్కుబాయి వచ్చి భర్త పక్కనే కుర్చీలో కూర్చుని "ఎందుకయినా మంచిది. మీ స్నేహితుడు పాండురంగంగారికి ఫోన్‌చేసి ఇంటి గురించి చెప్పండి" అన్నది.

శివకామయ్య సరేనన్నాడు.

ఆయనకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు అమ్మాయిలు. పెద్ద కొడుక్కి

ఇద్దరమ్మాయిలకీ పెళ్లిళ్లు చేసాడు. రెండో కొడుకు సూర్యమోహన్‌కి మూడునెలల క్రితం పెళ్లి చేసాడు. కోడలు ఇందుమతి నెలరోజుల క్రితమే కాపురానికి వచ్చింది.

"ఇప్పుడు వీళ్లు కూడా వెళ్లిపోతే ఇంట్లో మనిద్దరమే వుండాలి" అన్నది సక్కుబాయి అదోలా.

"దిగులుగా వుందా?" శివకామయ్య అడిగాడు.

"అదే తెలీడం లేదు" అన్నదామె.

"మొదట్లో కొంచెం వెలితిగా వుంటుంది. తర్వాత అలవాటుపడిపోతాం".

"అవును.... ఎప్పుడో పెళ్లయినప్పుడు ఒంటరిగా వున్నాం. తల్చుకుంటే ఆశ్చర్యంగా వుంది" అన్నది సక్కుబాయి.

"అదే జీవితం అంటే. కొత్త మనుషులు రావడం, కొన్నాళ్లకు వాళ్లు పాతబడటం.... మళ్లీ కొన్ని మార్పులు, చివరకు కథ మొదటికి రావడం.

"జీవితం ఒక అవర్త దశాంతంలాంటిది. ఇలా ప్రతి జీవితంలోనూ జరుగుతూనే వుంటుంది. మార్పు వుండదు".

"వేదాంతం చెబుతున్నారా?" సక్కుబాయి అడిగింది.

"ఇది వేదాంతమని నేను అనుకోను సక్కూ. జీవితం పట్ల నాకు వున్న ఒకరకమయిన అవగాహన".

వాళ్ళు అలా మాట్లాడుకుంటున్నప్పుడు సూర్యమోహన్ వచ్చి తన పోస్టింగ్ గురించి తండ్రితో చెప్పాడు.

శివకామయ్య తన కొడుకు సెల్‌ఫోన్ నుంచి ఒంగోలులో వున్న తన స్నేహితుడు పాండురంగానికి "కొడుక్కి ఒంగోలులో ఉద్యోగం వచ్చిందని చెప్పి, వాళ్ల ఇంట్లో రెండు గదులు అద్దెకు ఇవ్వమని" అడిగాడు. అందుకు పాండురంగం సరేనన్నాడు. ఎప్పుడయినా వచ్చి చేరవచ్చునని చెప్పాడు పాండురంగం.

ఆ మర్నాటినుంచే సూర్యమోహన్ తను ఒంగోలు తీసుకువెళ్లే సామాన్లను ప్యాక్ చేయడం మొదలుపెట్టాడు. సక్కుబాయి తన కోడలు ఇందుమతిని అడిగి వాళ్లకు అవసరమయిన వంట సామాగ్రిని ప్యాక్ చేయించింది.

రెండు రోజుల్లో అన్నీ సర్దుకోవడం అయిపోయింది. లారీ స్టాండుకు వెళ్లి సూర్యమోహన్ బాడుగకు లారీని మాట్లాడి వచ్చాడు. రాత్రి ఏడు గంటలకు ప్రయాణం.

శివకామయ్య పెద్ద కొడుకు చంద్రనారాయణ గుంటూరులో ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. అతను తన భార్య ప్రాణేశ్వరితో కలిసి తమ్ముడికి వీడ్కోలు ఇవ్వటానికి వచ్చాడు.

అనుకున్నట్టుగానే రాత్రి ఏడు గంటలు దాటుతున్నప్పుడు లారీలో సామాన్లు వేసుకుని భార్య ఇందుమతితో ఒంగోలుకు వెళ్లిపోయాడు సూర్యమోహన్.

వాళ్లు వెళ్లిన కొంతసేపటికి మేము కూడా వెళతామంటూ బయల్దేరాడు చంద్రనారాయణ. శివకామయ్య సరేనన్నాడు. రెండు రోజులు వుండమని చెప్పాలనుకున్నది సక్కుబాయి. కానీ భర్త అదోలా వుండటం చూసి బయటకు అనలేదు.

వాళ్లిద్దరూ వెళ్లిపోయారు.

ఇప్పుడు ఆ ఇంట్లో వాళ్లిద్దరే –

రాత్రి తొమ్మిది గంటల సమయంలో వేడినీళ్లతో స్నానం చేశాడు శివకామయ్య. భోజనం చేసిన తర్వాత భార్యచేత పక్కమీద దుప్పటిని మార్పించాడు. పడకమీద దిండ్లను సరిచేసి తన మొహంలోకి వింతగా చూస్తున్న భార్య మొహంలోకి చూసి అదోలా నవ్వాడు.

పడుకున్న తర్వాత అడిగింది సక్కుబాయి.

"పెద్దవాడు వెళతానంటే మాటవరసకయినా రెండు రోజులు వుండమని అంటారని అనుకున్నాను. కానీ మీరెందుకో అనలేదు".

"అనవసరంగా ఎందుకని అనలేదు సక్కూ. వాడు రేపు ఆఫీసుకు వెళ్లాలి. వాడు ఇక్కడ వుండి చేసేదేమీ లేదు. అందుకే వుండమని అనలేదు" వివరణ ఇచ్చాడు శివకామయ్య.

"అసలు మీ మనసులో ఏముందో చెబుతారా?" కుతూహలంగా అడిగింది సక్కుబాయి.

"చాలా సింపుల్.... తిరిగి కొత్త జీవితాన్ని అనుభవించబోతున్నాం" అన్నాడు శివకామయ్య.

"అంటే?"

"పెళ్లయిన కొత్తలో పిల్లలు పుట్టేవరకూ మనిద్దరమే సహ జీవనం సాగించాం. పిల్లలు పుట్టారు. పెరిగి పెద్దవాళ్లయి ఇపుడు తల్లిదండ్రుల పాత్రను పోషించడానికి

వెళ్లిపోయారు! ఒక దీపం మరికొన్ని దీపాలను వెలిగించినట్టు. మళ్లీ మనిద్దరమే మిగిలిపోయాం. అయినా నీకో విషయం చెప్పనా?" గుసగుసలాడుతున్నట్టుగా అడిగాడు.

"చెప్పండి ఏమిటి?" అన్నది సక్కుబాయి నవ్వుతూ.

"వయస్సులో కోరికలతో నిమిత్తం లేకుండా భార్యాభర్తల ఏకాంత సహజీవనంలో ఒక థ్రిల్ వుంది. అందువల్ల వాళ్ల మధ్య భద్రతాభావం, అన్యోన్యత కలకాలం నిలిచి వుంటాయి. జీవితం పట్ల మమకారం అధికమవుతుంది. ప్రేమ, ఆప్యాయత ఎక్కువ అవుతాయి. ఇద్దరం ఒక్కటే అనే ఫీలింగ్ ఏర్పడుతుంది. నిజం సక్కూ.... మనిద్దరం ఒక్కటే. ఇద్దరం ఒక్కటిగానే జీవితాన్ని ప్రారంభించి వెళ్లదీసాము. ఇద్దరం ఒక్కటిగానే ఈ లోకాన్ని విడిచి...."

శివకామయ్య మాట పూర్తి కాకుండానే - అరాచకం వద్దు - అన్నట్టుగా తన కుడిచేతి అరచేతితో భర్త పెదవులను సతారంగా మూసింది సక్కుబాయి. ఆమె కనులను పల్చటి కన్నీటి పొర కమ్మివేసింది. ❖

*కథాకేళి మాసపత్రిక, జూలై 2009*